
# హాల్మార్క్ నేరేడు పండు

రోడ్డు మీద నడుస్తున్నాడు మంగపతి. భుజాన ఓ సంచీ వేలాడుతోంది. పేపరు చుట్టిన పాత డైరీ, దానికితోడు ఆకలేసినప్పుడల్లా రెండు మూడు వరసలొలుచుకుని పొట్టలోకి పంపించడానికి రెండు మొక్కజొన్న కంకులు, దస్తీతో కట్టిన మూటలో నాలుగు అల్లో నేరేడు పండ్లున్నాయి ఆ సంచీలో. తను జనంలో నడుస్తున్నా అందరూ తనని వదిలిపెట్టి పరుగెత్తుతున్నట్లుగా ఉంది.

ఈ మహానగరంలో తన దరిద్రపు రూపాన్ని



వెనక నుంచే - నడక చూసి 'అరేయ్ ఆగు' అన్న కేక వినిపించింది. నన్నెవరు మాట్లాడిస్తా రులే అని గట్టిగా అనుకున్న తనకు గట్టి దెబ్బ తగిలింది. ఆ కేక పెట్టింది బద్రి. చిన్నప్పుడు తనతోపాటు చదువుకున్నవాడు. తను చదువు కుంటూంటే వాడు చదువుకోనివాడు. కళ్లజోడు, కాళ్లజోడు అన్నీ కొత్తగా కళకళలాడుతున్నాడు. తళతళ మెరుస్తున్నాడు. బద్రి... బద్రిగాడు... బద్రీ నారాయణ... వరివాముల వెంకట బద్రీ నారాయణరావు.

తనకు ఎంతో సంతోషం వేసింది. క్షణంలో భయం వేసింది. తను తనే అంటే తననిలా చూసిన తనను తను చూడలేదనే భయం! వెం టనే ఓ నిర్ణయానికి వచ్చాడు. తను మంగపతి నన్న నిజాన్ని దాచిపెట్టాడు.

"అరేయ్! మంగపతీ!" ఆనందంగా అరి చాడు బద్రి.

"ఎవరండీ మీరు" అన్నాడు మంగపతి.

"అరేయ్ మంగపతీ నేను బద్రిగాణ్ణిరా" కళ్లలో కళ్లు పెట్టి అన్నాడు బద్రి.

"సారీ... నాకు మీ మంగపతి పోలికలుం డొచ్చు.

కానీ బద్రి వెళ్లలేదు. తన సంగతి తనకెలా గూ తెలుసు. బద్రి నిర్ణయమే తనకు తెలియ లేదు.

"మీరు ఏమనుకోకపోతే నాదో కోరిక. మీరు నా మంగలాగ ఉన్నందుకే ఎగిరి గంతేస్తు న్నాను. ఎన్నేళ్లయిందో. వాణ్ణి చూసిన ఆనందం నాకు కలిగించారు. కాబట్టి మీ రుణం నేను తీర్చుకోవాలి" అన్నాడు బద్రి.

"అంటే ఏం చేస్తారేంటి?" అడిగాడు మంగ పతి.

"వాడికి అల్లో నేరేడు పండ్లు ఎంతో యిష్టం. నేను చెట్టెక్కి దులిపితే వాడు ఏరుకునేవాడు. హైదరాబాదంతా తిరిగైనా సరే ఆ పండ్లు మీకి వ్వాలి నేను" అన్నాడు బద్రి.

"ఏమండీ... నాకు ఆ పళ్లంటే వళ్లంతా గగుర్పాటు. మీ రుణం తీర్చుకోడానికి మీతో పాటు జంటనగరాలు తిరిగే ఓపిక నాకు లేదు. ముఖ్యంగా టైం లేదు" అన్నాడు మంగపతి. ఏ భావం లేకుండా బద్రి తనని చూడడంతో తడబడ్డాడు తను. బయటికి తెలియకుండా జాగ్రత్తపడ్డాడు.

"సార్! మీ కాళ్లు పట్టుకుంటా... యివ్వాళ మీరు నాతో పాటు ఉండండి. మీకు ఓపిక, శక్తీ నేను కలిగిస్తా..." అన్నాడు బద్రి.

"సరే! మీ ఇష్టం. ఇప్పుడు టైమెంత" అం టూ క్లాక్ టవర్ చూసాడు మంగపతి.

"టైమ్ కోసం దానిని చూడక్కర్లే. కాలం నా చేతికి చుట్టబడి ఉంది. మీ జీవితంలో ఈ ఒక్కరోజు మీది కాదనుకోండి... మిమ్మల్ని మీరు మరచిపోండి... నా కోరిక ఏదీ కాదనకండి" వేడుకున్నాడు బద్రి.

"సరే అలాక్కానీండి" అన్నాడు మంగపతి.

*     *     *

కలా నిజమా అనేట్లు గంటలో తన రూపా న్ని పూర్తిగా మార్చేసాడు బద్రి. అది నవనాగరిక మైన అయిదు చుక్కల హోటల్ గది. అందులో ఉంచాడు తనని. 'ఇంత పెద్దవాడివెలా అయ్యా వురా?' అని ఆప్యాయంగా అడగాలనిపించింది తనకు. నటన అడ్డమొచ్చింది.

"ఇప్పుడే వస్తా కంగారు పడకండి" అని

**రాంపా**

బయటికి వెళ్లాడు బద్రి.

గుక్క తిప్పుకోకుండా అయింది.

నిన్న తనని చూసినవాళ్లు ఇవ్వాళ చూస్తే గుర్తుపట్టలేరు.

తనని తనే గుర్తు పట్టేట్టులేదు. ఇంతచేసిన తన స్నేహితుడికి తనెందుకు అపరిచితుడిగానే ఉన్నాడు? ఆలోచిస్తూ అద్దం ముందు అందాలు చూసుకుంటున్నాడు మంగపతి. తనిలాగే ఉంటే రేపు బద్రి కనిపించడు. అప్పుడు బద్రి కొని పెట్టిన గడియారం, సూటు, బూటు అన్నీ అమ్ము కుని బతకాల్సిందే.

ఛ! ఏమిటి తను చేస్తున్న పని? ఎందుకీ అభిమానం? వాణ్ణి వాడిగా కలవాల్సిందే... కానీ వద్దు. తన దరిద్రం బద్రికి తెలియకూడ దు. చిన్నప్పుడు సరదా వెక్కిరింతలలో తనది పైచేయిగా ఉండేది. ఇప్పుడూ ఆ చేయి అలాగే ఉండాలి. ఏమిటి తన ఆనందం? తన తృప్తి? ఏమన్నా సంస్కారం అనిపించుకుంటుందా?... ఆలోచిస్తూ శంకర్ జైకిషన్ హిట్స్ వింటూ తన్మయత్వంలో ఉన్న తనకు పోలీసు బూట్ల అపశృతి వినిపించింది.

"ఏయ్ మిస్టర్ నీపేరేంటి?" గదిలోకి దూసు కొచ్చిన పోలీస్ సౌండ్ కక్కాడు.

## పాలకొల్లులో నన్నయ సహస్రాబ్ది ఉత్సవాలు

పాలకొల్లులో ఆగస్టు 12, 13 తేదీలలో 'నన్నయ సహస్రాబ్ది ఉత్సవాలు' నిర్వహించనున్నట్లు ఉత్సవాల సారథ్య సంఘ సభ్యులు శ్రీ పెద్దిభొట్ల లక్ష్మీనారాయణ తెలిపారు. 12వ తేదీ ఉదయం 9-00 గంటలకు జరిగే ప్రారంభసభలో ఆధ్యాత్మిక తత్వవేత్త శ్రీ నాన్నగారు, కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీశలాక రఘునాధశర్మ పాల్గొంటారు. పాలకొల్లు శాసనసభ్యులు డాక్టర్ సిహెచ్. సత్యనారాయణమూర్తి ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొంటారు.

ఈ రెండు రోజుల కార్యక్రమంలో పలువురు వక్తలు వివిధ అంశాలపై ప్రసంగిస్తారు. డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు (నన్నయ నాటి ప్రేమతత్వము-నేటి ప్రేమతత్వము), డాక్టర్ కేసాప్రగడ సత్యనారాయణ (నన్నయ నానా రుచిరార్థ సూక్తినిధి), డా॥ ఆర్.యస్. వెంకటేశ్వరరావు (నన్నయ-ప్రకృతి చిత్రణ), శ్రీ కోవెల సంపత్కుమారాచార్య (ఆంధ్ర మహాభారతం-అవతారిక), శ్రీమతి సి. మృణాళిని (సభాపర్వం-మనోవైజ్ఞానికత), డాక్టర్ గరికిపాటి నరసింహారావు (నాటి నన్నయ-నేటి అవసరం), శ్రీ కనుములూరి వేంకటశివయ్య (ద్యూతము-అనుద్యూతము) ఈ ఉత్సవాలలో ప్రసంగిస్తారు.

శ్రీ మానాప్రగడశేషసాయి, భారతాచార్య శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు, శ్రీ మల్లంపల్లి శరభేశ్వరశర్మలను ఈ ఉత్సవాలలో సన్మానిస్తారు. ముగింపు సమావేశంలో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆవుల మంజులత ముఖ్యఅతిధిగా పాల్గొం టారు. ఇతర వివరాలకు శ్రీ పెద్దిభొట్ల లక్ష్మీనారాయణ (94408-94395), శ్రీ పి.ఎస్.ఎన్. రాజు (94409 27899) లను సంప్రదించవచ్చు.

"నా పేరు చక్రపాణి" తడబడుతూ చెప్పాడు మంగపతి.

"నువ్వెవరివైతే నాకేంటి? పద బొక్కలో దూరుదువుగాని" గాండ్రించాడు పోలీసు.

"అదేంటండీ మీరెవరు? నేనెవర్ని? మీరొచ్చిన కారణమేంటి? నేను చేసిన నేరం ఏంటి? నన్నెందుకు అరెస్టంటున్నారు. కనీసం కొద్ది సేపాగండి. ఈ రూమ్ ఎవరి పేరు మీదుందో అతనొస్తాడు" దీనంగా అన్నాడు మంగపతి.

"వాణ్ణి కూడా నీ బొక్క పక్క బొక్కలో వేస్తాం ముందు నువు రారా" అంటూ నెట్టింది పోలీసు చేయి. వేషం ఎంత గంభీరంగా ఉన్నా లోపల తన దరిద్రం, పిరికితనం. చిన్ననాటి స్నేహితుడు అన్న ఆనందం తప్పితే యిన్నేళ్ల వ్యవధిలో వాడెలా యింతటి వాడయ్యాడు, వాడి బతుకేంటి? వివరాలు తెలియకుండా యిరుక్కుపోయాను. భగవంతుడా ఒక్క పూటలో నన్నంత ఎత్తుకి తీసికెళ్లి కిందపడేసావే! అన్ని దెబ్బలూ నాకే తగలాలా? కటకటా కటకటాల పాలాయెనా బతుకు?

* * *

"సార్! ఆ బద్రి నా చిన్నప్పటి స్నేహితుడు సార్. వాడు చాలా మంచి వాడుసార్. వాడికీ ఈ నేరానికీ ఏ సంబంధం ఉండి ఉండదు సార్. మీరు ఎవరో అనుకుని మమ్మల్ని అనుమానిస్తున్నారు. బద్రిని రానీయండి సార్" దీనాతిదీనంగా వేడుకున్నాడు.

"పెద్ద దొరగారొస్తున్నారు. పక్కకు జరగండి"

అందరూ ఎలర్టయ్యారు.

"ఏదీ వీళ్ల ఫైలు? యింకొకడేడీ?" అడిగాడు ఆఫీసర్.

"వాణ్ణి కూడా ఓ గంటలో పట్టుకొస్తాం సార్. మనవాళ్లు అదే పనిలో ఉన్నారు సార్. యితనేదో కథలు చెబుతున్నాడు సార్"

"డిగ్రీలు కొలిచారా?"

"యింకా లేదు సార్"

"ఆ. ఏంట్రా! నువ్వు రూమ్‌లోకి ఎంటరయినప్పుడు ఎలా ఉన్నావు? మా వాళ్లు వచ్చినప్పుడు ఎలా ఉన్నావు?" అడిగాడాఫీసరు చాలా గంభీరంగా. మొనగాళ్లకు మొనగాడులో ఎస్వీరంగారావు గొంతులాగా. ఏ దరిద్రపు గొట్టు వేషం ఎవరూ చూడకూడదనుకున్నాడో ఆ వేషాన్ని వర్ణిస్తూ స్టేట్‌మెంటివ్వాల్సి వచ్చిందే... ముందే ఎందుకు బయట పడాలనుకుని,

"ఇలాగే ఉన్నాను సార్" అన్నాడు మంగపతి.

"నీ వెంట ఉన్న సంచీ ఏంచేసావు"

"ఏ సంచీ సార్"

"నువ్విలా నిజం చెప్పేట్లు లేవు. అరేయ్ ఆ దస్తీ మూట తీసుకురాంర్రా"

ఓ కానిస్టేబుల్ తీసుకొచ్చాడు.

"ఏమిటిది? ఈ బాంబులు పెట్టుకుని ఎందుకు తిరుగుతున్నావు"

"అవి బాంబులు కాదు సార్... అల్లో నేరేడు పండ్లు" వినయంగా చెప్పాడు మంగపతి.

"అదే... ఆ పళ్లంటే నీ వళ్లంతా గగుర్పాటా?" నవ్వుతూ అన్నాడు ఆఫీసర్.

"అరేయ్ బద్రీ..." స్నేహితుణ్ణి గట్టిగా పట్టుకుని ఆనందంగా ఏడ్చాడు అప్పటి వరకూ తలదించుకునే సమాధానాలు చెబుతున్న మంగపతి. ●